ప్రజాశక్తి

మంగళవారం 07 నవంబర్ 2023

5

అనంతపురం

నేలకొరిగిన వరిపంట

అకాల వర్షాలకు నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసన వర్షానికి వరి పంట నేలకొరింది. కృష్ణాపురం, మైలాపురం, ఉద్దేహాళ్, దేవగిరి, గోనెహాళ్, శ్రీధరఘట్ట, సింగేపల్లి, కళ్లదేవనహళ్లి, పొన్నూరు గ్రామాల్లో హెచ్ఎల్సీ ఆయకట్టు కింద రైతులు వరి పంటను సాగు చేశారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఈ పంట నేలకొరిగింది. మండల వ్యాప్తంగా దాదాపు మూడు వేల ఎకరాల్లో పంట నష్టపోయినట్లు రైతులు చెబుతున్నారు. కోతకోసి కుప్పలుగా వేసిన మొక్కజొన్న కూడా పలు ప్రాంతాల్లో తడిసిపోయింది. ఇది కూడా 200 ఎకరాల పంట తడిసిపోయినట్లు తెలుస్తోంది. పంట సాగు కోసం రైతులు ఎకరాకు రూ.30వేల వరకు ఖర్చు చేశారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలకు పూర్తిగా నేలకొరిగింది. హెచ్ఎల్సీ కింద సాగుచేసిన చివరి ఆయకట్టుకు నీరందక గత నెలలో పంట మొత్తం ఎండిపోయింది. ఇక వేరుశనగ, కొర్ర, కంది పంటలు వర్షాలు లేక ఎండిపోయాయి. ఈ ఏడాది పంటలన్నీ ఏదో రూపంలో చేతికందకుండా పోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ఇలా నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి అకాల వర్షాలతో నష్టపోయిన పంటను అంచనా వేసి, నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

కరువుపై కరుణచూపేరా..?

◆ నేడు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పుట్టపర్తికి రాక ◆ ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఏడాది తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు, ప్రజలు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మంగళవారం నాడు శ్రీసత్యసాయి జిల్లా పర్యటనలో భాగంగా పుట్టపర్తికి విచ్చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటనపై అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు. తీవ్రమైన కరువులో ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాపై ముఖ్యమంత్రి ఏమైనా కరుణ చూపుతారా అని ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కరువు మండలాల ప్రకటన ఇటీవలనే రాష్ట్ర ప్రభుత్వం చేసింది. ఇందులో కొన్ని మండలాలను మినహాయించారు. అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్న డిమాండ్ అందరి నుంచి వస్తోంది. సత్యసాయి జిల్లాలో 31 మండలాలుంటే ఏడు తీవ్రమైన కరువు మండలాలుగానూ, 15 మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించారు. తక్కిన 11 మండలాలు కరువు మండలాలుగా ప్రకటించలేదు. వీటిని కూడా ప్రకటించాలనని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 31 మండలాలుంటే 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. మూడు మండలాలను మినహాయించారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి వాతావరణ పరిస్థితులూ అంతటా ఒకే రకంగా ఉన్నాయి. వర్షాలు అప్పుడప్పుడు పడినా ఆదునుదాటక రావడంతో రైతులు పంటల సాగు కూడా పూర్తి స్థాయిలో చేయలేకపోయారు. రెండు జిల్లాల పరిధిలో కలిపి మొత్తం ఎనిమిది లక్షల ఎకరాల వరకు భూమి బీడుగానే ఉంది. వర్షపాతం రిత్యా చూసుకున్నా సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు 487.7 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 306.3 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 37.2 శాతం వర్షపాత లోటుంది. అదే సమయంలో అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 428.6 మిల్లీమీటర్లకుగానూ 267,5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. ఇక్కడ కూడా సత్యసాయి జిల్లాతో సమానంగా 37.6 మిల్లీమీర్లు వర్షపాతం లోటుంది. వర్షపాతం అక్టోబరు మాసంలో మరింత తక్కువగా పడింది. దీంతో వేసిన పంటను తొలగించడంలోనూ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రబీ సాగు కూడా నా మాత్రంగానే ఈ ఏడాది ఉంటోంది.

ఉపాధి లేక వలసలు

తీవ్ర వర్షాభావం నేపథ్యంలో పంటలు ఏ మాత్రం చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉపాధి లేక గ్రామాల నుంచి అప్పుడే వలసలు మొదలయ్యాయి. సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి, కదిరి, పెనుకొండ మండలాల నుంచి వలసలు అధికంగా ఉంటున్నాయి. వలసల నివారణకు చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులు ఇంకా మొదలవలేదు. ఈ ఏడాది ఉపాధి హామీ పనులు కూడా తక్కువగానే జరిగాయి. సత్యసాయి జిల్లా పరిధిలో 2.73 లక్షల జాబ్‌కార్డులుంటే 1.3 లక్షల మందికి పని కల్పించారు. అది కూడా సీజన్ ప్రారంభానికి మందే ఏప్రిల్, మే మాసాల్లోనే కల్పించారు. ఇప్పుడు పనుల్లేకపోవడంతో కర్నాటక, కేరళ రాష్ట్రాలకు ఉపాధి కోసం వలసలు వెలుతున్నారు. పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తప్పని సాగునీటి కష్టాలు

సాగునీటి కష్టాలు ఈ ఏడాది అధికంగా ఉండనున్నాయి. ఇప్పటికే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా రెండు కాలువలకు నీటిని నిలిపేస్తున్నారు. దీంతో అనంతపురం జిల్లాలో ఈ రెండు కాలువల కింద సాగైన వరి, మిరప, పత్తి పంటలకు పూర్తిగా దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయి. పంట దిగుబడులు రావడానికి కీలకమైన సమయంలో నీరు రాకపోతే రైతులు పెద్దఎత్తున నష్టపోయే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. నీటిని అందించేందుకు ప్రభుత్వ స్థాయిలోనే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని రైతులు కోరుతున్నారు.

కరువు సహాయం ప్రకటించేరా .?

తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో ప్రజలను ఆదుకునేందుకు ఏమైనా సహాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటిస్తారా అని అనంతపురం, సత్యసాయి జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. రాబోయే తాగు,సాగునీటి కష్టాలను ఎదుర్కొనేందుకు ఏ రకమైన చర్యలు తీసుకుంటారన్నది ప్రకటిస్తారా అని కూడా ఎదురు చూస్తున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగనుంది ఇలా..?

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు తాడేపల్లిలోని ఆయన నివాసం నుంచి బయలుదేరుతారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 9.30 గంటలకు బయలుదేరి 10.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. 10.25 గంటలకు వరకు ప్రజాప్రతినిధులను కలుసుకుంటారు. అక్కడ నుంచి బయలుదేరి ఉదయం 10.45 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.15 గంటలకు సభలోని పాల్గొని రైతుభరోసాను విడుదల చేస్తారు. ప్రసంగం, మెగా చెక్ పంపిణీ అనంతరం 12.20 గంటలకు తిరుగు ప్రయణమవుతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు విమనాశ్రయం చేరుకుని అక్కడి నుంచి తిరిగి విజయవాడకు పయనమవుతారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పుట్టపర్తి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి మంగళవారం నాడు పుట్టపర్తి పర్యటన సందర్భంగా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్.అమ్మిరెడ్డి ఎస్పీ ఎస్‌వి.మాధవ్ రెడ్డి తో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో బందోబస్తు కీలకంగా ఉండాలని అధికారులకు సూచించారు. బహిరంగ సభ స్థలం, బందోబస్తు, కాన్వాయి, ట్రాఫిక్, విఐపిల వాహనాల నిలిపే ప్రాంతాలు, సభ సమీపంలో ఉన్న వై.జంక్షన్‌లో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై పోలీసు అధికారులకు సూచించారు. అంతకు మునుపు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణంలో ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తుకు విచ్చేసిన పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ మాధవరెడ్డి సమావేశం నిర్వహించారు. బందోబస్తుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీ సత్యసాయి, చిత్తూరు జిల్లాల అడిషనల్ ఎస్పీలు విష్ణు, సుధాకర్, విజయ్ భాస్కర్ రెడ్డి, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీనివాసులు, హుస్సేన్ పీరా, కన్జక్షన్, కెవిఆర్ వరప్రసాద్, నర్సింగప్ప, విజయ నాయక్‌తో పాటు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తుపై పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డిఐజి

తాడిపత్రిలో డ్రెయినేజీ వార్

◆ మురుగునీటిలో కూర్చొని ప్రభాకర్‌రెడ్డి నిరసన

◆ ఆయనకు వ్యతిరేకంగా వైసిపి నాయకుల నినాదాలు

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రిలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య డ్రెయినేజీ కాలువల నిర్మాణపై వాదప్రతివాదనలు జరుగుతున్నాయి. స్వప్రయోజనాల కోసం తాడిపత్రిలో అధికార పార్టీ నాయకులు అండర్ డ్రెయినేజీ పనులకు ఆటంకాలు కల్పిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం పట్టణంలోని ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న డ్రెయినేజీ నీటిలో టిడిపి మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని బిందెల కాలనీలో ఎమ్మెల్యే తన ప్రయోజనాల కోసం అండర్ డ్రైనేజీలోకి ఓపెన్ డ్రెయినేజీని కలిపారన్నారు. తద్వారా అండర్ డ్రెయినేజీ సమస్య మరింత తీవ్ర రూపం దాల్చి, రోడ్డుపైకి మురుగునీరు చేరుతోందన్నారు. అండర్ డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ ఏమాత్రం సహకరించగాలేదన్నారు. కమిషనర్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నేడు నిరసన కార్యక్రమం చేపట్టామని అన్నారు.

మురుగునీటిలో కూర్చొని నిరసన తెలుపుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రభాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా వైసిపి శ్రేణుల నినాదాలు

జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆందోళన చేస్తున్న ప్రాంతానికి వైసిపి శ్రేణులు చేరుకున్నాయి. జెసి.ప్రభాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ గంగయ్య, పట్టణ సిఐ హమీద్ ఖాన్‌లు అక్కడికి చేరుకున్నారు. జెసి.ప్రభాకర్ రెడ్డితో మాట్లాడారు. రోడ్డుపై నిలిచిన నీటి సమస్య పరిష్కరించేందుకు రెండు గంటల నుంచి మున్సిపల్ సిబ్బంది పని చేస్తున్నారని, సమస్య పరిష్కారం అవుతుందని చెప్పి ప్రభాకర్‌రెడ్డితో నిరసన విరమింపజేశారు.

మీడియా గొంతు నొక్కాలనుకోవడం బాధాకరం

సిఐటియు ఆధ్వర్యంలో ఎఫ్ఐఆర్ కాపీలు దగ్ధం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మీడియా గొంతు నొక్కాలనుకోవడం బాధాకరమని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం జర్నలిస్టులపై తప్పుడు కేసులు బనాయించి అక్రమ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ రైతుసంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎఫ్ఐఆర్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల అరెస్టులను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా కిసాన్ కోఆర్డినేషన్ కమిటీ, అఖిల భారత కేంద్ర కార్మిక సంఘాల జేఏసి పిలుపు మేరకు ఎఫ్ఐఆర్ ప్రతులను దహనం చేసినట్లు తెలిపారు. కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తున్న న్యూస్‌క్లిక్ వార్తా ఛానల్‌పై మోడీ ప్రభుత్వం కక్షకట్టిందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా నడిపిన రైతు ఐక్య ఉద్యమానికి మద్దతుగా నిలబడడమే వారు చేసిన నేరమైనట్లు అరెస్ట్ చేశారన్నారు. రాజ్యాంగం అనుమతించిన భావ ప్రకటనా స్వేచ్ఛను కూడా మోడీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. న్యూస్ క్లిక్ జర్నలిస్టులు ప్రబీర్ పురకాయస్త, అమిత్ చక్రవర్తుపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసి జైల్లో పెట్టిందన్నారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఎఫ్ఐఆర్ ప్రతుల దహనాన్ని అడ్డుకుని మంటలు ఆర్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, సిఐటియు నాయకులు ఎటిఎం నాగరాజు, రాయుడు, నల్లప్ప, రాముడు, నరసింహారెడ్డి, నాగార్జున, ఓబులేసు, శంకర్, ఆదినారాయణ, నాగమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్ కాపీలను దగ్ధం చేస్తున్న సిఐటియునా యకులు

బుక్కరాయసముద్రం : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మీడియా గొంతు నొక్కాలనుకోవడం బాధాకరమని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం న్యూస్ క్లిక్ మీడియా సంస్థ అధిపతి ప్రబీర్ పురకాయస్తపై పెట్టిన అక్రమ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోర్త్ ఎస్టేట్‌గా పిలిచే మీడియాపై కేంద్రంలోని బిజెపి ఆంక్షలు విధించడం మీడియా నోరు నొక్కేయడమే అన్నారు. నిజాలను నిర్భయంగా ప్రజలకు తెలియజేస్తే అడగదొక్కాలని చూడటం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, రైతుసంఘం జిల్లా నాయకులు కుళ్లాయప్ప, పోతలయ్య, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డిపల్లి శ్రీనివాసులు, వెంకటకొండ బాలక్రిష్ట, పరమేష్, శివ, సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్ర, సంజీవరెడ్డి, పుల్లయ్య, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. మా ఊర్లో మద్యం అమ్మకుండా చేయండి..

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ముందు మహిళల ఆవేదన

ప్రజాశక్తి-గార్లదిన్నె

'అమ్మా.. మా ఊర్లో మందు అమ్మనీయకుండా చేయండి..' అంటూ ఎమ్మెల్యే పద్మావతి ముందు మండల పరిధిలోని కోటంక మహిళలు వాపోయారు. సోమవారం మండల పరిధిలోని కోటంక గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం పథకాల లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఎమ్మెల్యే ముందు తమ గోడును వెల్లబోసుకున్నారు. తమ గ్రామంలో ఉన్న బెల్ట్ షాపుల కారణంగా కల్తీ మందు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కల్తీ మందు తాగడం వల్ల మృత్యువాత పడుతున్నారన్నారు. దీంత చాలామంది మహిళలు ఇప్పటికే విధవలుగా మారుతున్నారన్నారు. కావున మీరైనా స్పందించి బెల్ట్‌షాపులు ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెంకటనారాయణ, తహశీల్దార్ ఉషారాణి, కన్వీనర్ నరేందర్‌రెడ్డి, తాతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే జిల్లా వెనుకబాటు

◆ అభివృద్ధిపై స్పందించని పాలకులు ◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ◆ జిల్లా సమగ్రాభివృద్ధికే ప్రజారక్షణభేరి స్కూటర్‌యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం, శింగనమల, నార్పల, పుట్లూరు, తాడిపత్రి, పెద్దవడుగూరు

ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యంతోనే అనంతపురం జిల్లా అత్యంత వెనుకబాటుకు గురవుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విమర్శించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరి స్కూటర్‌యాత్ర సోమవారం ప్రారంభం అయ్యింది. బుక్కరాయసముద్రం మండలంలో ప్రారంభం అయిన యాత్ర శింగనమల, నార్పల, పుట్లూరు, తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పామిడి, గుత్తి, గుంతకల్లు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సభల్లో నాయకులు స్థానిక సమస్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజిత రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో అత్యంత వెనుకబడిన జిల్లాగా అనంతపురం ఉందన్నారు. జిల్లాకు ఉన్న ఏకైక సాగునీటి వనరు తుంగభద్ర హెచ్ఎల్‌సి కింద నిర్ణయించిన ఆయకట్టు భూములకు ఇప్పటి వరకూ ఏనాడు పూర్తిస్థాయిలో నీరు అందించిన దాఖలాలు లేవన్నారు. ఎడారిలో పండే కర్జూరాలు, మంచు ప్రాంతంలో పండే ఆపిల్, ఆధునికమైన డ్రాగాన్ ఫ్రూట్స్ పంటలను జిల్లా రైతులు పండిస్తున్నా పంటను ఎగుమతి చేసేందుకు అవసరమైన మార్కెట్ సౌకర్యంలేదన్నారు. 15 సంవత్సరాలుగా హంద్రీనీవా నీరు వస్తున్నా ఆయకట్టుకు నీరు ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. వెయ్యి మందికి ఉపాధి చూపే ఒక్క పరిశ్రమ కూడా జిల్లాలో లేదన్నారు. ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో ఇంటర్, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, పీజీలు పూర్తిచేసిన వేలాదిమంది యువతీ, యువకులు పొట్టచేతబట్టుకుని ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాల్టీ, క్యాన్సర్ ఆసుపత్రుల నిర్వహణ పట్ల పాలకులు కనీస శ్రద్ధపెట్టడంలేదన్నారు. పేదలు ఇళ్ల స్థలాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తూనే ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ భూములు, దేవాదాయ స్థలాల్లో పేదలు గుడిసెలు వేసుకుంటే అదేదో నేరం అన్నట్లుగా భావించి అధికారులు నిర్దాక్షణంగా వాటిని కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గార్లదిన్నె మండలం కల్లూరులో గ్రామంలో ఇటీవల చోటు చేసుకున్న పేదల గుడిసెల తొలగింపు అత్యంత దుర్మార్గమైనదన్నారు. ఇళ్లు కూల్చివేత సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరు సభ్యసమాజం తలదించుకునేదిలా ఉందన్నారు. పేదలపై అనుచితంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునేందుకు జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వర్షాభావం నేపథ్యంలో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. హెచ్ఎల్‌సి, హంద్రీ-నీవా కాలువల కింద సాగుచేసిన పంటలకు పూర్తిస్థాయిలో నీరు అందించాలన్నారు. పండ్ల తోటల ఆధారిత పరిశ్రమలను స్థాపించాలన్నారు. ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి, రోజుకు 600 కూలి ఇవ్వాలన్నారు. పండ్ల తోటల ఆధారంగా జిల్లాలో మార్కెట్ సౌకర్యం, శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలన్నారు. పేద సాగు రైతులందరికీ వ్యవసాయ సాగు భూమి ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసి, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. మున్సిపల్ పట్టణాల్లో చెత్త, ఇంటి పన్నులను రద్దు చేయాలన్నారు. జిల్లా అభివృద్ధికి మేధావులు, యువత, ప్రజాసంఘాల నాయకులు అనేక ప్రత్నామ్నాయ ప్రతిపాదనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకునే స్థితిలో లేదన్నారు. ఈ పరిస్థితుల్లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 29న జిల్లాకు చెందిన ప్రముఖులతో "జిల్లా సమగ్రాభివద్ధి- ప్రత్యామ్నాయ విధానాలు"పై సదస్సును నిర్వహించిందన్నారు. ఈ సదస్సు నిర్ణయించిన విధానాల అమలు కోసం ఉద్యమం తప్పా, వేరే మార్గంలేదన్నారు. అందులో భాగంగా ప్రజా చైతన్యం కోసం నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో స్కూటర్ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నవంబర్ 15న చలో విజయవాడ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓనల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకనారాయణ, భాస్కర్, నాయకులు వి.శివారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్‌తో పాటు ఆయా మండలాల సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో స్కూటర్‌యాత్రలో పాల్గొన్న సిపిఎం నాయకులు

శింగనమలలో వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న రాంభూపాల్, సిపిఎం నాయకులు

గ్రూప్ స్టడీస్‌తో సత్ఫలితాలు : జెఎన్‌టియు విసి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు ఒక్కరే కాకుండా గ్రూప్ స్టడీస్ చేయడం ద్వారా సత్ఫలితాలు సాధిస్తారని జెఎన్‌టియు ఉపకులపతి జి.రంగజనార్ధన సూచించారు. సోమవారం స్థానిక జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ అధ్యక్షతన ఫ్రెసర్స్ డే-2023 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ చదువుతున్న విద్యార్థులు జూనియర్లు, సీనియర్లు అనే తారతమ్యం లేకుండా అందరూ కలిసికట్టుగా చదువుతున్నారన్నారు. విద్యార్థులు వికశించే పుష్పాలు అన్నారు. విద్యార్థి దశలో ఇంజనీరింగ్ చదివే సమయం చాలా విలువైందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, బి.దుర్గాప్రసాద్, ఇ.కేశవరెడ్డి, పి.సుజాత, పద్మ సువర్ణ, జి.వి.సుబ్బారెడ్డి, ఎ.సురేష్‌బాబు, ఎన్.విశాలి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, కోఆర్డినేటర్, సెక్రటరీ స్పోర్ట్ కౌన్సిల్ బి.జోజిరెడ్డి, భువనవిజయ, టి.బాల నరసయ్య, ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, ఎ.పి.శివకుమార్, లలితకుమారి, డి.విష్ణువర్ధన్, ఎం.రామశేఖరరెడ్డి, జి.మమత, దిలీప్‌కుమార్, డాక్టర్ కళ్యాణి రాధా, డాక్టర్ మంజుల, అజిత, మాజీ ఆచార్యులు వి.శంకర్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా టెన్నిస్ జట్టుకు అభినందన

అనంతపురం జెఎన్‌టియు నుంచి ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకూ జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్ టెన్నిస్ క్రీడలు ఆడేందుకు బెంగళూరు వెళ్తున్న టెన్నిస్ మహిళల జట్టును విసి రంగ జనార్ధన, రెక్టార్ విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ బెంగళూరు జైన్ యూనివర్సిటీలో నిర్వహించనున్న అంతర్ విశ్వవిద్యాలయ టెన్నిస్ పోటీల్లో జిల్లా మహిళల జట్టు పాలొంటుందన్నారు. వీరికి సుజాత కోచ్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రినిపల్ ఇ.అరుణకాంతి, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

జీవిత సాఫల్య పురస్కార గ్రహీతకు సన్మానం

ఉరవకొండ : వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కార అవార్డు గ్రహీత మల్లారెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ హనుమంతును జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు మాట్లాడుతూ ఆర్‌డిటి సహకారంతో మెట్ట వ్యవసాయంలో విశేష కృషి చేసినందుకు ఆర్డీటీ ఏఎఫ్ డైరెక్టర్ వైవి మల్లారెడ్డికి వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారం వరించిందన్నారు. అలాగే అనంతపురం జిల్లా అడిషనల్ ఎస్పీ హనుమంతు జీవితం ఎంతోమంది నిరుద్యోగులకు నేటి పౌరులకు ఆదర్శవంతంగా నిలిచారన్నారు. వారి సేవలను కొనియాడుతూ ఇద్దరినీ వేరువేరుగా సన్మానించినట్లు తెలిపారు.

వైసిపిలో చేరిన పామిడి నూరు

ఉరవకొండ : టిడిపి నాయకులు నూరు సోమవారం వైసిపిలో చేరారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి నివాసంలో యువనేత వై.ప్రణయ్‌రెడ్డి నూరుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూరు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితుడినై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బసవరాజు, మైనార్టీ నాయకులు జాకీర్, హుస్సేన్, నిజాం, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

ఉరవకొండ : మండల పరిధిలోని రాచర్ల గ్రామంలో సోమవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుంతకల్లు డివైఎస్ఓ సాంబశివుడు ఆధ్వర్యంలో బోరు కింద సాగుచేసిన చెంచు ఎర్రిస్వామి సాగు చేసిన వేరుశనగ పొలంలో పంటకోత ప్రయోగం చేయగా 2.650 కిలోల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ హేమావతి, ఆర్‌బికె సిబ్బంది చిక్కన్న, రైతులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధితో పేదలకు భరోసా

శింగనమల : సిఎం జగన్ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భద్రత కల్పించడమేగాక, సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కూడా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. సోమవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని బాధిత కుటుంబాలకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలు వారి ఆర్థిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్పందించి సిఎం సహాయ నిధి నుంచి దాదాపు 19 కుటుంబాలకు రూ.27.06 లక్షలు మంజూరు చేయించారు. దీంతో బాధితులు సిఎం జగన్, ఎమ్మెల్యే పద్మావతి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి పన్నులు తగ్గించాలి

నార్పల : మండల కేంద్రంలోని సిపిఐ కాలనీలో ఇంటి పన్నులను తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో స్థానికులు తహశీల్దార్ హరికుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలు నివసించే సిపిఐ కాలనీలో ఒక్కో రేకులషెడ్డుకు సుమారు రూ.841 ఇంటి పన్ను వేశారన్నారు. ఇంత మొత్తాన్ని కట్టాలంటే పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. అధికారులు స్పందించి పేదలపై భారం పడకుండా పనులు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్ద పెద్దయ్య, శీను, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

బెలుగుప్ప : మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు చందు కోరారు. ఈమేరకు సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్లపల్లి గ్రామ చుట్టుపక్కల ప్రాంతాలైన రమణేపల్లి, కాశీపురం, కంచనపల్లి, వేపరాళ్ల, బూదివర్తి, శ్రీరంగాపురం, తదితర గ్రామాల విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి గుండ్లపల్లిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.

రేపు నార్పలలో 'జగనన్నకు చెబుదాం'

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం జగనన్నకు చెబుతాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఒ దివాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ గౌతమి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యల్లనూరు ఎస్ఐగా విజయభాస్కర్

పుట్లూరు : యల్లనూరు ఎస్ఐగా విజయభాస్కర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రామకృష్ణ తాడిపత్రికి బదిలీగాగా విఆర్‌లో ఉన్న విజయభాస్కర్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువాలన్నారు. అలాకాకుండా గొడవలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

గుత్తి : ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ గుత్తి డివిజన్ ఇఇ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.శ్రీకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (ప్రత్యేక విద్యుత్ అదాలత్) ఛైర్మన్ వి.శ్రీనివాస, ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు కె.రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్.అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు జి.ఈశ్వరమ్మ హాజరవుతారని తెలిపారు. వినియోగదారులు ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో సమస్యలను రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

చరిత్రలో నిలిచేలా 'ప్రజా సంకల్ప పాదయాత్ర'

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి - ఘనంగా ఆరేళ్ల వేడుక

ప్రజాశక్తి-అనంతపురం

కేక్ కోస్తున్న వైసిపి నాయకులు

సిఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్రజా సంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక జెడ్పీ వద్ద ఉన్న వైఎస్ఆ ర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టిడిపి పాలనలో ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకునేందుకు జగన్ రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘ పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. దాదాపు 341 రోజుల పాటు 3648 కిలోమీటర్లు ప్రజలతో మమేకమయ్యారన్నారు. పాదయాత్రలో ఏ కష్టాలైతే తెలుసుకున్నామో వాటికి పరిష్కార మార్గాలుగా పథకాలను రూపొందించి అమలు చేస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : సిఎం జగన్ ప్రతిపక్ష నేతగా చేపట్టిన ప్రజా సకల్ప యాత్ర సంక్షేమాభివృద్ధికి నాందిగా నిలిచిందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రజా సంకల్ప యాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయ ఆవరణలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ప్రతిపక్షనేతగా జగన్ చేపట్టిన పాదయాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం పక్కన ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఊరేగింపుగా శాంతినగర్‌లోని వారపు సంత మైదానం వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, వైస్ ఛైర్మన్ శ్రీనివాసయాదవ్, గౌని ఉపేంద్రరెడ్డి, కౌన్సిలర్లు శారద, గోవిందరాజులు, షబ్బీర్,పెద్ద వన్నూరప్ప, శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ శివప్ప, స్టేట్ హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి పాల్గొన్నారు.

బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిసి.రమేష్‌గౌడ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశంలో, రాష్ట్రంలో బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించి రాజ్యాధికారంలో భాగస్వాములను చేయాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిసి.రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిసి కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దశాబ్దాల తరబడి బిసి కుల గణన, చట్టసభల్లో రిజర్వేషన్ అమలు చేయాలని పోరాటాలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సమాజ అభివృద్ధికి, ఆత్మగౌరవం కోసం జీవనం సాగిస్తున్న బిసిల డిమాండ్లు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ ప్రవేశపెట్టినప్పటికీ బిసి మహిళల రిజర్వేషన్ ఎంతో స్పష్టత ఇవ్వలేదన్నారు. కుల గణన చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల అసెంబ్లీలో తీర్మాణం చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా పార్లమెంట్‌లో తీర్మాణం చేసి కుల గణన చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జోగి రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అనువైన చోట ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు

ప్రజాశక్తి-ఉరవకొండ

లబ్ధిదారులకు అనువైన చోట ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, వైసిపి మండల కన్వీనర్ బసన్న తెలిపారు. సోమవారం విడపనకల్లులో పేదలకు ఇళ్లపట్టాల సమస్యపై తహశీల్దార్ ఈరమ్మతో ప్రజాప్రతినిధులు సమావేశం ఏర్పాట చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విడపనకల్ మండల కేంద్రంలో ప్రజలకు ఆవాస యోగ్యమైన ప్రాంతంలో స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అయితే లబ్ధిదారులు ఎవరి మాటా నమ్మవద్దన్నారు. కావున లబ్ధిదారులంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచి ఓబుళమ్మ, సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు సుంకన్న, విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, యూత్ విభాగం మండల అధ్యక్షుడు సిద్ధార్థ, సర్పంచులు మోదుపల్లి రామాంజనేయులు, దేవరాజు, ఉమాశంకర్, కేసన్న, రాజశేఖర్, రఘురాం, దేవేంద్ర, రామాంజనేయులురెడ్డి, నాయకులు రాజశేఖర్, ఓబులేష్, తిమ్మరాజు, మల్లికార్జున, వెంకటేష్, డిష్ వెంకటేష్, రాము రెడ్డి, హంపయ్య, ప్రసాద్, అశోక్‌రెడ్డి, ఎర్రన్న, మేకల చిన్న తిమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-ఉరవకొండ

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విడపనకల్లు ఎంపిడిఒ శ్రీనివాసులు సూచించారు. సోమవారం విడపనకల్లు మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విడపనకల్లులోని అన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది, వాలంటరీలు సమన్వయం చేసుకుని ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించాలన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వారాలు ప్రబలకుండా నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులు నిర్వహించి అప్రమత్తం చేయాలన్నారు. ఒకవేళ ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే గమనించి ఏరియా వాలంటరీలు తప్పనిసరిగా కుటుంబాన్ని సందర్శించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సత్యబాబు, ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యల ఏకరువు

ప్రజాశక్తి-కుందుర్పి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి కమలానాగరజు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు సమస్యలు ఏకరువుపెట్టారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల వైఫల్యంతో మండలంలో సంక్షేమ భవన నిర్మాణాలకు గ్రహణం పట్టిందని జడ్పిటిసి రాధాస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చుట్టపు చూపుగా కార్యాలయాలకు వచ్చిపోతూ సంక్షేమ పథకాలను నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ఎంపిడిఒ లక్ష్మినరసింహ మాట్లాడుతూ భవన నిర్మాణాలు చేపట్టడానికి ముందుకొచ్చే కాంట్రాక్టర్లకు నెల లోపు బిల్లులు చేయిస్తాం, అడ్వాన్స్‌గా రూ. 2 లక్షల చెక్కు కూడా ఇస్తామని తెలిపారు. శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని ప్రతి సమావేశంలో మొరపెట్టుకున్నా ఫలితం లేదని మహంతపురం ఎంపిటిసి ఈరన్న పేర్కొన్నారు. జంబుగుంపుల అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త నిర్లక్ష్యం తో కేవలం ముగ్గురు నలుగురు పిల్లలు హాజరవుతున్నారని సర్పంచి గంగాధర్ ఫిర్యాదు చేశారు. బెస్తరపల్లి, అప్పిలేపల్లి గ్రామాల్లో డీలర్లు రేషన్ బియ్యం, నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపిపి శ్రీలక్ష్మిఅజయ్‌బాబు, ఎంపిడిఒ లక్ష్మీనరసింహ, తహశీల్దార్ విజయ్‌కుమారి, ఐసిడిఎస్ సిడిపిఒ వనజాక్షి, సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

గుత్తి : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి హామీ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ సంజిత్‌నాయక్ విద్యార్థినులతోపాటు అధ్యాపకులను వేధిస్తున్నారని వారం రోజులుగా కళాశాలలో ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో నైరుతీరెడ్డి సోమవారం కళాశాలను సందర్శించి విద్యార్థినులు, అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సస్పెండ్ చేసి మహిళా ప్రిన్సిపల్ నియమించాలని అధ్యాపకులు, విద్యార్థినులు కోరారు. ఇందుకు నైరుతీరెడ్డి స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, కౌన్సిలర్లు వి.వరదరాజులు, రమణ, నరేష్, వైసీపీ నాయకులు బి.రమేష్‌రెడ్డి, లాలూనాయక్, విద్యార్థి సంఘాల నాయకులు మోహన్ రంగా, పవన్ గౌడ్, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

నార్పల : కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని కేశేపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త భాస్కర్‌ను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమం టిడపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఎర్రినాగప్ప, రాఘవనాయుడు, పీరా, కేశవరెడ్డి, నాగేంద్ర, రామాంజిరెడ్డి, పుల్లయ్య, శ్రీరాములు, నాగరాజు, కురగానపల్లి గోపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, శేష, టైలర్ రామంజి, రవి, ధన, రాఘవేంద్ర, సురేష్, భాస్కర్, సి.నాగేంద్ర, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల నుంచి ఫోన్లు కొనొద్దు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

బాధితులకు ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

అపరిచితులు విక్రయించే మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసి మోసపోవద్దని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో రూ.40.35 లక్షల విలువజేసే 208 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. జిల్లా పోలీసు శాఖ వినూత్నంగా చాట్ బాట్ సేవల ద్వారా ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసి అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ దుకాణం నిర్వాహకులైనా, వ్యక్తులైనా ఎవరి వద్ద నుంచీ కొనుగోలు చేయవద్దన్నారు. ఆసుపత్రిలో కుటుంబ సభ్యులకు సీరియస్‌గా ఉందని, డబ్బు ఐవసరమై మొబైల్ అమ్ముతున్నామని నమ్మబలుకుతూ తిరస్కరించిన మొబైల్ ఫోన్లను అమ్మే వీలుందన్నారు. అమ్మేవారు మనకు బాగా తెలిసిన వారైనప్పటికీ ఫోన్ బిల్లులు, సంబంధిత మొబైల్ ఫోన్ వివరాలు కలిగిన బాక్స్ ఉంటేనే కొనాలని సూచించారు. బిల్లు లేకుండా సెల్‌ఫోన్ అమ్ముతామంటూ నమ్మబలికే వ్యక్తులు, సెల్ ఫోన్ దుకాణాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, తదితర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరించే వారిపై సమీపంలోని పోలీసుస్టేషన్‌కు, ఎస్పీ మొబైల్ నెంబర్ 94407 96800కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

చలో తిరుపతి పోస్టర్లు విడుదల

పోస్టర్లను విడుదల చేస్తున్న ఎఐబిఎస్ఎస్ నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : శ్రీస్వామి హతీరాం బావాజీ బర్ని భక్తి ర్యాలీ నవంబర్ ఈనెల 10, 11వ తేదీల్లో నిర్వహించనున్న చలో తిరుపతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టిటిడి బోర్డు కమిటీ సభ్యులు సి.అశ్వర్థనాయక్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ స్వామి హతీరాం బావాజీ బర్ని భక్తి ర్యాలీ నేపథ్యంలో దేశంలోని అన్ని రాష్ట్రాల బంజారా సోదరులను, దేశ విదేశాల నుంచి వచ్చే బంజారా కుటుంబాలను కలిసే అవకాశం కలుగుతుందన్నారు. కావున ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అనంతపురం జిల్లా అన్ని మండలాలు, తండాల కమిటీ సభ్యులు, బంజారాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శి పి.బాబు నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్‌నాయక్, విజయబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'అనంత'కు ఎపిటిఎఫ్ ధన్యవాదాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎమ్మెల్యేకు బొకే అందజేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ఇటీవల ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అనంతపురం జిల్లా సందర్శించి ఉపాధ్యాయులపై విధించిన సస్పెండ్‌ను ఎత్తివేయడంలో సహకరించిన ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డికి ఎపిటిఎఫ్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సెస్పెన్షన్‌పై ఎమ్మెల్యే స్పందించి విద్యాశాఖ మంత్రితో సంప్రదించి ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్ ఆర్డర్స్‌ను రద్దు చేస్తూ రీయింస్టేట్ ఆర్డర్స్‌ను వెంటనే ఆయా ఉపాధ్యాయులకు, అధికారులకు అందేలా సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, మండల విద్యాశాఖ అధికారుల సంఘం నాయకులు వెంకటస్వామి, నరసింహారెడ్డి, జయమణి, సతీష్ కుమార్, చెన్నకేశవ, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్పను కరువు మండలంగా ప్రకటించాలి : జనసేన

ప్రజాశక్తి-బెలుగుప్ప

బెలుగుప్పను కరువు మండలంగా ప్రకటించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు కాశంశెట్టి సుధీర్ కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌కార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురవకపోవడంతో బెలుగుప్ప మండలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం, మిరప వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయాన్ని వదిలేసి పక్కరాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారన్నారు. కరువు పరిస్థితులు ఏర్పడటంతో సాగు భూములు బీడు భూములుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున బెలుగుప్ప మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాయి, చందు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్ బాల్ పోటీలకు గుత్తి విద్యార్థిని

ప్రజాశక్తి-గుత్తి

విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకురాలు

ఎపి ఆదర్శ పాఠశాల, కళాశాలకు చెందిన ఓ విద్యార్థినీ ఫుట్‌బాల్ క్రీడలో ఉత్తమ ప్రతిభ చాటుతోంది. కళాశాలలో ఇంటర్ సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.మమత ఇటీవల జరిగిన పాఠశాలల క్రీడల్లో భాగంగా మదనపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 19 పోటీల్లో ప్రతిభ కనబరిచింది. దీంతో విద్యార్థిని త్వరలో పంజాబ్ లో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. మమతను ప్రిన్సిపల్ ఎన్.ఉషా, వ్యాయామ ఉపాధ్యాయిని సుధారాణి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కె.మమత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల తోపాటు ప్రోత్సాహం లేకపోయినప్పటికీ ఫుట్ బాల్ క్రీడలో రాణించడం అభినందనీయమని చెప్పారు. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాలని ఆకాంక్షించారు.

'క్యాట్' ఫలితాల్లో 'శ్రీ చైతన్య' ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న శ్రీచైతన్య ఏటీపీ-8లో క్యాట్ 2003-2004 ఒలింపియాడ్ మొదటి లెవెల్‌లో 19 విద్యార్థులు రెండవ దశకే అర్హత సాధించినట్లు పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈమేరకు రెండవ దశకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్టమైన పాఠ్యప్రణాళిక అత్యంత అనుభవం కలిగిన ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణతోనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయన్నారు. వీరితోపాటు తల్లిదండ్రులు సహకారం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం నాసాకిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నేత్రావతి, డీన్ అరుణ్‌కిరణ్, కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జిలు దేవి, కృప, నాసా ఇన్‌ఛార్జి సుప్రజ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నాసా కిట్లను అందజేస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజిఎం సుబ్బారెడ్డి

నేరాలు ఘోరాలు

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

చోరీ కేసు ఛేదింపు

రూ.32 లక్షల విలువజేసే బంగారం స్వాధీనం : ఎస్పీ

అనంతపురం క్రైం : నగరానికి చెందిన విక్కీ అలియాస్ షామీర్‌ను సోమవారం స్థానిక త్రీ టౌన్, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుడి నుంచి నుంచి రూ.32 లక్షల విలువజేసే 54 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నటుల ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రం సూరత్‌కి చెందిన షామీర్ ఆరేళ్ల వయసులోనే ఇంట్లో చెప్పకుండా అనంతపురం వచ్చాడు. అనంతపురంలోని విజయనగరం కాలనీలో ఉన్న అనాథాశ్రమంలో ఉంటూ 10వ తరగతి వరకు చదివాడు. అనంతరం కడప జిల్లాలోని బాలల హోంకు తరలించారు. అక్కడ కూడా ఉండలేక తిరిగి అనంతపురం వచ్చి హోటళ్లలో క్లీనర్‌గా, సప్లయర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇతను గతనెల 15, 22, 27వ తేదీల్లో నగరంలోని 2వ రోడ్డులో ఉంటున్న ఆదిశేషయ్య గుప్తా ఇంట్లో చొరబడి చోరీలకు పాల్పడ్డాడు. మూడు దఫాల్లో సుమారు 54 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. ఈ కేసును సీరియస్ గా తీసుకున్న ఎస్పీ ఆదేశాల మేరకు అనంతపురం డీఎస్పీ ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద నిందితున్ని అరెస్టు చేశారు. దొంగతనానికి గురైన సొత్తును రికవరీ చేసిన త్రీ టౌన్ సీఐ ధరణీకిషోర్, సీసీఎస్ సీఐ జీటీ నాయుడు, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ద్విచక్ర వాహన దొంగలు అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ద్విచక్ర వాహనాలు దొంగిలించే ముగ్గురిని అరెస్టు చేసి రూ13.70 లక్షలు విలువజేసే 14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన కుందాని దినప్రకాష్, నార్పల మండల కేంద్రానికి చెందిన ఆవుల సిద్ధార్థ, స్థానిక భైరవనగర్‌కు చెందిన సంపతి విజయ్ ఉన్నారు. వీరిలో కుందాని దినప్రకాష్ ముఖ్యుడు. వీరు నకిలీ తాళాల సహాయంతో అనంతపురం, నార్పల, పుట్లూరు, బుక్కరాయసముద్రంలో వాహనాలను దొంగిలించారు. దొంగిలించిన వాహనాలను విక్రయించడానికి సంపతి విజయ్‌ని ఉపయోగించారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ ఆదేశాల మేరకు అనంతపురం డీఎస్పీ ప్రసాదరెడ్డి స్థానిక వన్ టౌన్ సీఐ రెడ్డప్ప, ఎస్ఐ పి.వెంకటేశ్వర్లు బృందంగా ఏర్పడి కలెక్టరేట్ వద్ద ఉన్న గోశాల వద్ద నిందితులను అరెస్టు చేశారు. వన్ టౌన్ సీఐ రెడ్డప్ప, ఎస్ఐ వెంకటేశ్వర్లు బృందాన్ని ఎస్పీ అభినందించారు.

రైలు ఢీకొని చేనేత కార్మికుడు మృతి

గోపాల్ (పాతచిత్రం)

గుంతకల్లు : పట్టణంలోని ఏసీఎస్ మిల్లు కాలనీలో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు వగ్గా గోపాల్ (38) సోమవారం ప్రమాదవశాత్తు రైలు ఢీకొని దుర్మరణం పాలయ్యాడు. గోపాల్ ఉదయాన్నే బహిర్భూమికి తమ ఇంటి సమీపంలో ఉన్న పొలాల వద్దకు వెళ్లి తిరిగి వస్తూ రైలు పట్టాలు దాటుతుండగా అకస్మాత్తుగా గుంతకల్లు నుంచి గుత్తి వైపు వెళ్లే రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాల్ అక్కడికక్కడే మృతిచెందాడు. గోపాల్ చేనేత మగ్గం నేస్తూ కుటుంబ పోషణ చేసేవాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జిఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు.

ఎద్దు మృతి

పుట్లూరు : పశువైద్యుల నిర్లక్ష్యంతో రూ.5లక్షల విలువజేసే ఎద్దు మృతిచెందిన ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రైతు రామకృష్ణ వివరాల మేరకు.. రాతి దూలం లాగే ఎద్దు ఐదు రోజుల నుంచి అనారోగ్యంగా ఉంది. ఈ విషయాన్ని బాధిత రైతు పశువైద్య అధికారి దృష్టికి తీసుకెళ్లాడు. అయితే వైద్యాధికారి మాత్రం కనీసం ఎద్దును పట్టించుకున్న దాఖలాలు లేవని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈనేపథ్యంలో అనారోగ్యం విషమించి సోమవారం ఎద్దు మృతి చెందిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సుమారు రూ.5లక్షల వరకూ నష్టపోయామని వాపోయాడు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యాధికారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం రైతు కోరాడు.

అభ్యుదయ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ ఫోరం కమిటీ ఎన్నిక

తాడిపత్రి రూరల్ : అభ్యుదయ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ ఫోరం కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని నంద్యాల రోడ్డులో ఉన్న హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో రాయలసీమ ఛైర్మన్‌గా రాంబాబు, వైస్ ఛైర్మన్‌గా బండారు అమర్‌నాథ్‌బాబును ఎన్నుకున్నట్లు అభ్యుదయ హ్యూమన్ రైట్స్ జాతీయ ఛైర్మన్ సగబాల రామాంజనమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్ నందిని, అనంతపురం మహిళా ఛైర్మన్ రోజా నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు సాయమేదీ..? : 'కాలవ'

రాయదుర్గం : టిడిపి పాలనలో ప్రతి అడుగులో రైతుకు సాయమందించగా, ప్రస్తుత జగన్ ప్రభుత్వం మోసం చేస్తూ రైతు ద్రోహిగా నిలిచిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని ఆవులదట్ల గ్రామంలో టిడిపి హయాంలో రైతులకు ఉచితంగా ఇచ్చిన మోటారు వద్ద సోమవారం కాలవ 30వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో నియోజకవర్గంలో 450మందికి పైగా రైతులకు ఉచితంగా మోటార్లతో పాటు ప్యానల్ బోర్డులు, పంపులు పంపిణీ చేశామన్నారు. సిఎం జగన్ రైతు పక్షపాతి అని డబ్బాలు కొడుతున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి 'జలకళ' ద్వారా ఎంతమంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించారో చెప్పాలని నిలదీశారు. వైసిపి ప్రభుత్వంలో రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడం లేదన్నారు. అనేక సబ్సిడీ పథకాలను రద్దు చేసి రైతు ద్రోహులుగా మారారని మండిపడ్డారు.

స్కూటర్‌యాత్రను జయప్రదం చేయండి

రాయదుర్గం : జిల్లా అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 6,7 తేదీల్లో జిల్లాలో తలపెట్టిన స్కూటర్ యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక నాయకులతో కలిసి పార్టీ కార్యాలయం వద్ద 'ప్రజారక్షణభేరి' గోడపత్రికలను ఆవిష్కరించారు. మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని, వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50వేలు పరిహారం అందించాలని కోరారు. హెచ్ఎల్‌సి, హంద్రీ-నీవా కాలు వల కింద సాగుచేసిన పంటలకు పూర్తిస్థాయిలో నీరందించాలని, పండ్ల తోటల ఆధారిత పరిశ్రమలను స్థాపించి ఉద్యోగావకాశాలు కల్పించాలని, తదితర డిమాండ్ల సాధనకై స్కూటర్ యాత్ర చేపట్టారన్నారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు మధు, నాగరాజు, తిమ్మరాజు, రమేష్, అనిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ పాల్గొన్నారు.

కొండాపురంలో ఉచిత పశు వైద్యశిబిరం

రాయదుర్గం రూరల్ : వాటర్ షెడ్ స్కీం ప్రారంభ దశ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాయదుర్గం వాటర్‌షెడ్ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని డి.కొండాపురం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్య శిబిరంలో పశువులకు వివిధ రకాల పరీక్షలు చేసి, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. శిబిరంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి సుధాకర్, ఆవులదట్ల పశు వైద్యులు శిరీష, వాటర్‌షెడ పిఒ శ్రీవిద్య, టెక్నికల్ ఆఫీసర్స్ ఈరన్న, విశ్వేశ్వర, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

వైసిపి మంత్రులు ఆత్మపరిశీలన చేసుకోవాలి : కందికుంట

ప్రజాశక్తి కదిరి అర్బన్

సామాజిక సాధికారత బస్సు యాత్ర పేరుతో బడుగు బలహీన వర్గాలకి పెద్ద పీట వేశామని ప్రగల్భాలు పలుకుతున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి, మంత్రులు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై విమర్శించారు. వైసిపి పాలకులు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధిని మరిచి రాక్షస పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్న రామచంద్రారెడ్డి ఈ జిల్లాలపై సవతిప్రేమ చూపుతున్నారన్నారు. ఈ ప్రాంత రైతాంగాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా స్వలాభం కోసం కేవలం పుంగనూరు మంత్రిగా ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. పుంగనూరుకు చెర్లోపల్లి రిజర్వాయర్ నీటిని తీసుకెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కదిరి చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యవసాయ నీటిని, మున్సిపాలిటీలో తాగు నీరు అవసరాలు తీర్చడం కోసం ఆరోజున చంద్రబాబు నాయుడు నీటిని కేటాయిస్తే నేడు నీటి లభ్యత కూడా లేకుండా చేసి స్టోరేజ్ చేయకుండా తన ప్రాంతానికి అనుకూలంగా మార్చుకున్నారని విమర్శించారు. ఈ నిర్ణయంతో ఈ ప్రాంతంలో ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న ఎమ్మెల్యేలు, మంత్రులు సిగ్గు తో తలవంచుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు పదవి వ్యామోహాలను పక్కనపెట్టి మంత్రులను ప్రశ్నించి జలవనరులను కాపాడాలని కందికుంట సూచించారు.

సెల్ టవర్ నిర్మించరాదని వినతి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని చెర్వేపల్లి వంకగడ్డ వీధిలో సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టరాదని కాలనీవాసులు తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 20 కుటుంబాలు ఉన్న తమకాలనీలో నివాసముండే బేతపల్లి పగ్గం నారాయణ ఖాళీ స్థలంలో జియో సెల్ టవర్ నిర్మించేందుకు కంపెనీవారు నిర్మాణాలు చేపడుతుండగా అడ్డుకున్నామన్నారు. అయితే కౌన్సిలర్ కుమారుడు నాగేంద్రబాబు, పగ్గం నారాయణ కుమారులు ప్రకాష్, రఘు తమను బెదిరిస్తున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. బెదిరింపులు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.

పశువుల పెంపకందారులకు సబ్సిడీ రుణాలు

గాండ్లపెంట : పశువుల పెంపకం దారులకు రాష్ట్ర ప్రభుత్వం పశువర్ధ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీ రుణాలు మంజూరు చేసిందని పశువైద్యాధికారి బి. చెన్నకేశవ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పశు పోషణకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందజేస్తుందన్నారు. 500 గొర్రెలు, 25 పొట్టేళ్ళ పెంపకానికి 50 లక్షల రూపాయలు, నూరు గొర్రెలు, ఐదు పొట్టేళ్లకు పది లక్షల రూపాయలు, పెరటి కోళ్లకు పెంపకానికి వెయ్యికోళ్ళు, వంద పుంజులు పెంపకానికి 25 లక్షల రూపాయలు, పందులు పెంపకానికి వంద ఆడ, 10 మగ పందులకు 30 లక్షల రూపాయలు మంజూరు చేస్తుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన రైతులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు వివరాలకు స్థానిక పశువైద్యశాలలో సంప్రదించాలని ఆయన చెప్పారు.

ప్రజాసంకల్ప యాత్రకు ఆరేళ్లు: ఎమ్మెల్యే

కదిరి అర్బన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి నేటికీ ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్దా రెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2017 నవంబర్ 6వ తేదీ నాడు ఇడుపులపాయ నుండి తన ప్రజా సంకల్ప యాత్రను ప్రారంభించి 3648 కిలోమీటర్ల మేర ఇచ్ఛాపురం వరకు నడిచి నేటికి ఆరు సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. ఆయన నడిచిన ప్రతి అడుగులోనూ లక్షల మంది వెంట ఉన్నారన్నారు. ప్రజల సమస్యలు వినడమే కాకుండా ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టే కార్యక్రమాలను పాదయాత్రలోనే రూపకల్పన చేయడం జరిగిందన్నారు. 2019వ సంవత్సరంలో జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి దేశంలో ఎక్కడ లేనివిధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీసా, వైసిపి నాయకులు సాదిక్‌బాషా, సాయి ప్రణీత్ రెడ్డి, ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, మల్లికార్జున, జిలాన్‌బాషా పాల్గొన్నారు.

‘భూ కబ్జాలకు పాల్పడలేదు’

కదిరి అర్బన్ : తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కొంతమంది స్వార్థ రాజకీయాల కోసం తనకు, తన కుటుంబ సభ్యులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని సాయి దేవానంద్ ఆవేదన వ్యక్తం చేశారు. భూ కబ్జాలకు పాల్పడ్డారంటూ లేనిపోని ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదులు చేయడం రాజకీయ దురుద్దేశంతోనే జరుగుతున్నాయన్నారు. గతంలో పుష్పా అనే ఆమె ఇద్దరం కలిసి భూమి కొనుగోలు చేశామన్నారు వ్యాపార నిమిత్తం కొని రికార్డు పరంగానే తీసుకున్నామని చెప్పారు. 3.50 ఎరాల భూమిని నగదు చెల్లించి కొనుగోలు చేశామన్నారు. ఇలాంటి బెదిరింపులకు ఎన్నడూ భయపడమని ప్రస్తుతం భూమి విషయం న్యాయస్థానంలో ఉందని చెప్పారు. వాటిపైన ఎలాంటి ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలు మానుకొని ప్రజల పక్షాన నిలబడి ప్రజలకు సేవ చేసే రాజకీయ నాయకులుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. తాను కాని, తన తండ్రి కాని ఎలాంటి భూ కబ్జాలకు పాల్పడలేదని అన్నారు.

వైద్యులకు సన్మానం

తలుపుల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ వైద్యులు సల్మామున్వర్ బాషాను ఘనంగా సన్మానించారు. వైద్యులు సల్మా, మున్వర్‌బాషా ఎమ్మెస్ సర్జన్ గైనకాలజీ ఉన్నత విద్యకు వెళ్తున్న వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

సత్యసాయి జిల్లాలోని 32 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఎం నాయకుడు పై పల్లి గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 11 మండలాలను మాత్రమే కరువు జిల్లాలుగా ప్రభుత్వం ప్రకటించడం శోచనీయమన్నారు. ఈ ఏడాది జిల్లాలోని అన్ని మండలాల రైతులు ఖరీఫ్ సీజన్లో పెట్టిన పంట పూర్తిగా కోల్పోయారన్నారు. వెంటనే నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను జిల్లాలోని మంత్రులు ప్రజాప్రతినిధులు పుట్టపర్తికి వస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తేవాలని కోరారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చదువుకు పేదరికం అడ్డు రాకూడదని భావించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి సుప్రియ పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. పట్టణంలోని ఏడవ వార్డుకు చెందిన నీలూరి గౌతమి ప్రస్తుతం బీటెక్ మూడవ సంవత్సరం సిఎస్‌సి గ్రూప్ చదువుతోంది. ఇటీవల గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా గౌతమి ఎమ్మెల్యేను కలిసి తన చదువుకు అవసరమైన లాప్టాప్ ఇవ్వాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తన నివాసానికి పిలిపించి గౌతమికి తల్లిదండ్రుల సమక్షంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి సుప్రియ చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందజేశారు. ఈసందర్భంగా గౌతమి, ఆమె తల్లిదండ్రులు ఎమ్మెల్యే దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సుప్రియ

పాఠశాలలకు సెలవు ప్రకటించడం అన్యాయం

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా పర్యటనకు రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తే జిల్లా వ్యాప్తంగా ఉన్నా ప్రవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు విమర్శించారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వారు మాట్లాడుతు గతంలో ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వస్తున్నారు అంటే ఆ పార్టీ నాయకులు, అధికారులు భయపడే వారన్నారు. అయితే ఇప్పుడు పాఠశాల విద్యార్థులు సైతం భయపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ముఖ్యమంత్రి ఏజిల్లా పర్యటనకు వెళితే ఆ జిల్లాలో ప్రవేటు పాఠశాలలకు సెలవు అన్నట్లు అర్థం అవుతోందన్నారు. ముఖ్యమంత్రితో పాటు అధికార పార్టీ నేతల నుంచి మెప్పు పొందడానికి ప్రవేటు పాఠశాలలకు సెలవులను ఇచ్చి, ఆయా పాఠశాలల బస్సులను జనాలను తరలించడానికి వినియోగించుకోవడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటాపురం అభి, అభిషేక్, అమన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న ప్రజాసంఘాల నాయకులు

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం పక్కను ఉన్న ఇసుక రీచ్‌ను స్థానిక ప్రజాసంఘాల నాయకులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు ఆదినారాయణ, సిపిఐ కార్యదర్శి చింత పురుషోత్తం, జైభీమ్ భారత్ పార్టీ నాయకులు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఇసుకను తరలిస్తున్నారన్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందన్నారు. పెన్నానదిలో ఇసుక తరలించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఇసుక తరలించడం వల్ల ఏర్పడిన గోతుల్లో ప్రజలు, పిల్లలు పడి మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుకరీచ్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శరత్‌చంద్ర ఘటనా స్థలానికి వెళ్లిఆందోళనకారులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

ఉపాధ్యాయిని మృతి

గుత్తి : అనారోగ్యంతో బాధపడుతూ ఉపాధ్యాయిని మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి గుత్తిలోని కోట ప్రాంతంలో చోటుచేసుకుంది. మండలంలోని కొజ్జేపల్లి పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించే కష్టవేణి ఇటీవల కామెర్ల వ్యాధికి బారిన పడ్డారు. కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుత్తి : మండలంలోని కరిడికొండ గ్రామంలో సోమవారం అక్రమంగా నిల్వ ఉంచిన ప్రజా పంపిణీ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ టీం ఆధ్వర్యంలో పట్టుకున్నారు. గ్రామంలోని ఓ రేకులషెడ్డులో అక్రమంగా ఉంచిన 60 బస్తాల స్టోర్ బియ్యాన్ని టీం సభ్యులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్ కె.సూర్యనారాయణ తెలిపారు.

మద్యం పట్టివేత

పుట్లూరు : మండల పరిధిలోని చాలివేముల గ్రామంలో శివశంకర్‌రెడ్డి అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆశివశంకర్‌రెడ్డి మద్యం అమ్ముతున్నట్లు తెలుసుకుని దాడి చేసి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం పుట్టపర్తికి రానున్న నేపథ్యంలో అధికారులతో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు సమీక్షించారు. సోమవారం సభ వేదిక ప్రాంతంలో జిల్లా అధికారులతో ఈ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు అందరూ పరస్పర సహకారాలతో అప్పగించిన పనులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. వై జంక్షన్ లో రైతు భరోసా, పిఎం కిసాన్ పథకం ద్వారా ముఖ్యమంత్రి నిధులు విడుదల చేస్తారన్నారు. బహిరంగ సభకు తరలివచ్చే రైతులకు, ప్రజలకు, ప్రజాప్రతినిధులు, తదితరులకు కల్పిస్తున్న వసతులపై కలెక్టర్ అడిగి తెలుసుకొని పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రైతుల ప్రయాణ సౌకర్యం, సభా వేదిక నిర్మాణం, అలంకరణ ఏర్పాట్లు, సభలో కూర్చోవడానికి అవసరమైన చర్యలు, విద్యుత్ సరఫరా, పోలీస్ భద్రత చర్యలు, తాగునీటి వసతి, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు, విఐపి, మీడియా గ్యాలరీ ఏర్పాట్లు, విమానాశ్రయం నుంచి సభా వేదిక వరకు చేపట్టిన ఏర్పాట్లు, వైద్య శిబిరాల ఏర్పాట్లు, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ సేవలు, సభకు ప్రవేశ పాసులు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిపై కలెక్టర్ పరిశీలించి ఇంకా పూర్తికాని పనులు రాత్రికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.